

నేతలకు అవార్డులను ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్

అధికారం మళ్లీ మనదే

● ఈసారి 200 సీట్లకంటే ఎక్కువ

- ఇప్పటి నుంచే ఎన్నికలపై దృష్టి సారించండి
- డీఎంకే ముప్పెరుంవిళాలో స్టాలిన్ పిలుపు
- ఘనంగా డీఎంకే 75వ వార్షికోత్సవం

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ మళ్లీ డీఎంకేనే అధికారం చేపడుతుందని, ఈ సారి తమ కూటమి 200 సీట్లకు పైగా గెలుస్తుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సైనికుల్లా సునిశిత శిక్షణ పొందిన పార్టీ శ్రేణులపై నమ్మకం వల్లే ఈ ప్రకటన చేస్తున్నానని, అదే సమయంలో సోమరితనం విడిచి ఇప్పటి నుంచే అసెంబ్లీ ఎన్నికల వైపు దృష్టి సారించాలని స్టాలిన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నందనం వైఎంసీఏ మైదానంలో మంగళవారం సాయంత్రం జరిగిన ముప్పెరుం విళా సభలో ఆయన ప్రసంగించారు. డీఎంకే ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తికావటంతో పార్టీ వజ్రోత్సవాలు, పార్టీ వ్యవస్థాపకుడు అన్నాదురై జయంతి, ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ జయంతి కలుపుకుని త్రివిధ వేడుకల (ముప్పెరుం విళా) పేరిట పార్టీ మహానాడును తలపించేలా భారీ సభ నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ అధ్యక్షత వహించగా, డీఎంకే దక్షిణ చెన్నై జిల్లా శాఖ కార్యదర్శి, మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం 'కళగం నల్ల కళగం నమ్ ద్రావిడ మున్నేట్ర కళగం..' అనే పాటతో ప్రసంగాన్ని ప్రారంభించిన స్టాలిన్.. ఎంతోమంది త్యాగాల వల్లే పార్టీ ఇలా ఉన్నత స్థితికి చేరిందన్నారు. 53 యేళ్లపాటు పార్టీకి నిర్విరామంగా సేవలందించడం వల్లే పార్టీ అధ్యక్షుడిగా, సీఎంగా ఉన్నత స్థితికి చేరకోగలిగానని, ఈ పదవులన్నీ సులువుగా రాలేదనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. కలైంజర్ తర్వాత రాష్ట్ర ప్రజలంతా తనకు అండగా నిలిచారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి సీఎంగా చేశారన్నారు. డీఎంకే పార్టీ, రాష్ట్రం తన రెండు కళ్లుగా భావించి వాటి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానన్నారు. విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికా వెళ్లి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని విజయవంతంగా తిరిగొచ్చామని, ఆ సంతోషం వర్ణనాతీతమని, అమెరికాలో ప్రవాస తమిళ సంఘాల స్వాగత సత్కారాలను ఎన్నటికీ మరువలేనివన్నారు. ఓ పార్టీని 75 యేళ్లపాటు సుస్థిరంగా నడపడం సామాన్యమైన విషయం కాదన్నారు. 1977లో డీఎంకే పత్తాలేకుండా పోతుందని ప్రత్యర్థులు జోస్యం చెప్పారని, అయితే పార్టీకి అన్నాదురై, కరుణానిధి, అన్బళగన్ వంటి నాయకులు వేసిన పునాదులు గట్టివి కనుకే ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా స్థిరంగా ఉందన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలు అనే తారతమ్యం లేకుండా అన్నదమ్ముల అనుబంధంతో కొనసాగుతున్న పార్టీ డీఎంకే మాత్రమేనన్నారు. పార్టీ శతవార్షికోత్సవాలను ఇంతకంటే ఘనంగా జరుపుకుంటుందనే నమ్మకం తనకుందని సీఎం పేర్కొన్నారు. మరో వందేళ్ల డీఎంకే చెక్కుచెదరదని, పార్టీ ఏ ఆశయ సాధన కోసం ఏర్పడిందో వాటిలో ఇంకా ప్రధానమైనవి నెరవేరలేదన్నారు. నిర్బంధ హిందీ అమలు ఎదుర్కోవటం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి సాధన వంటి ముఖ్యమైన ఆశయాలను నెరవేర్చేందుకు పార్టీ శ్రమించాల్సి ఉందన్నారు. మూడేళ్ల డీఎంకే పాలనలో రాష్ట్రం సాధించిన ప్రగతిని భారతదేశమే చూస్తోందన్నారు. మూడేళ్లలో డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఏ రాష్ట్రంలోనూ లేవని గర్వంగా చెబుతున్నానని స్టాలిన్ పేర్కొన్నారు.

పార్టీ సేవకులకు అవార్డులు..

ఈ వేడుకల్లో పెరియార్ అవార్డును పాపమ్మాళ్‌కు, అన్నా అవార్డును అరంతాంగి మిసా గణేషన్‌కు, కలైంజర్ అవార్డును ఎంపీ జగద్రక్షగన్‌కు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ప్రదానం చేశారు. ఇదే విధంగా పావేందర్ అవార్డును కవి తమిళ్‌దాసన్‌కు, పేరాసియర్ అవార్డును వీపీ రాజన్‌కు ప్రదానం చేశారు. ఇక వజ్రోత్సవాల సందర్భంగా పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ పేరిట అవార్డు పార్టీ సీనియర్ నేత ఎస్ఎస్ పళనిమాణిక్యంకు అందజేశారు. అంతే కాకుండా పార్టీ పురోగతికి పాటుపడిన సీనియర్లకు తలా రూ.లక్ష చొప్పున నగదు కానుక అందించారు. ఈ వేడుకల్లో పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు పొన్ముడి, ఐ.పెరియసామి, ఎ.రాజా, కనిమొళి, అందియూరు సెల్వరాజ్, కోశాధికారి టీఆర్ బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ పాల్గొన్నారు.

ఉదయనిధిని డిప్యూటీ సీఎంగా ప్రకటించాలి : పళనిమాణిక్యం

అవార్డు గ్రహీతల తరఫున స్టాలిన్ అవార్డును అందుకున్న ఎస్ఎస్ పళనిమాణిక్యం ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి ఉదయనిధి పార్టీ భవిష్యత్ నాయకుడని కొనియాడారు. అదే సమయంలో స్టాలిన్ తర్వాత పార్టీని సమర్థవంతంగా నడిపించగల వారసుడెవరో పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ ప్రకటిస్తే బాగుంటుందని సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా ప్రకటించేందుకు స్టాలిన్ ఇంకా వెనుకాడటం భావ్యమేనా అని ప్రశ్నించడంతో సభలో కార్యకర్తల హర్షధ్వానాలతో పాటు నేతల మొహంలో నవ్వులు విరిశాయి. స్టాలిన్ సైతం నవ్వుతూ ఆయన మాటల్ని ఆలకించారు.

ఏఐ టెక్నిక్‌తో కలైంజర్ గ్రీటింగ్స్...

ఈ సభ ప్రారంభానికి ముందు కృత్రిమ మేథోపరిజ్ఞానం (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి కుర్చీలో కూర్చుని ఈ వేడుకలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలిపేలా తెరపై ప్రత్యక్షమయ్యారు. అది చూసిన పార్టీ శ్రేణులు కలైంజర్ వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.



'ఏఐ'తో కార్యకర్తలకు శుభాకాంక్షలు చెబుతున్న కరుణానిధి

వేసవిని తలపిస్తున్నాయ్...!

సాధారణం కన్నా 4 డిగ్రీల అధికం

చెన్నైలో 150 ఏళ్లలో ఐదోసారిగా అధిక ఉష్ణోగ్రతలు



చెన్నైలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

తేది	ఉష్ణోగ్రత
సెప్టెంబరు 19, 1883	38.9
సెప్టెంబరు 14, 1968	38.4
సెప్టెంబరు 8, 1997	38.5
సెప్టెంబరు 20, 2009	38.7

పెరంబూర్, సెప్టెంబరు 17: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 4-5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. బంగాళాఖాతంలో పశ్చిమ బెంగాల్ వద్ద తీరం దాటిన అల్పపీడనం దక్షిణ దిశగా పయనిస్తోంది. అది రాజస్తాన్ వరకు వెళ్లి క్రమంగా బలహీనపడనుంది. ఈ కారణంగా, మధ్యప్రదేశ్, రాజస్తాన్ తదితర రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. కానీ, దక్షిణాది రాష్ట్రాల్లో పొడివాతావరణం నెలకొంది. అదే సమయంలో, రాష్ట్రం మీదుగా వీస్తున్న పశ్చిమ గాలుల వేగంలో కూడా మార్పులు జరిగాయి. ఈ కారణంగా రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 4-5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికం కావడం, గాలిలో తేమ శాతం తగ్గడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రాజదాని నగరం చెన్నైలో రాబోయే 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. నగరంలో సోమవారం పగటి ఉష్ణోగ్రత 39 డిగ్రీలుగా నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. కేంద్రం గణాంకాల ప్రకారం, 150 ఏళ్లలో ఐదవసారిగా ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

11 ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు...

రాష్ట్రంలో సోమవారం 11 ప్రాంతాల్లో 100 డిగ్రీ ఫారన్‌హీట్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మదురై, మదురై విమానాశ్రయంలో 104 ఫారన్ హీట్ (40 డిగ్రీల సెల్సియస్) ఉష్ణోగ్రత నమోదైంది. ఇక, చెన్నై మీనంబాక్కం, అదిరామపట్టణం, కడలూరు, ఈరోడ్, కరూర్ పరమత్తి, నాగపట్టణం, పాళయంకోట, తంజావూరు, తిరుచ్చి తదితర ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం...

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజుకు సరాసరిన 30 కోట్ల యూనిట్లుగా ఉంటుంది. ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం అధికంగా నమోదవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేది ఎన్నడూ లేని విధంగా 45.43 కోట్ల యూనిట్లుగా నమోదైంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కర్మాగారాలు, విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు విద్యుత్ వినియోగం తగ్గుతోంది. కానీ, వాతావరణ మార్పుల కారణంగా ఈ నెల మొదటి వారం నుంచే భానుడి భగభగలు అధికమై ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, గత ఆదివారం ఎండ తీవ్రత కారణంగా ఏసీ వినియోగం పెరగడంతో, విద్యుత్ వినియోగం 36.94 కోట్ల యూనిట్లుగా నమోదైంది. అలాగే, ఈ నెలలో ఆదివారాలైన 1వ తేది 35 కోట్ల యూనిట్లు, 7వ తేది 36 కోట్ల యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. వాతావరణ మార్పుల కారణంగా ఆదివారం కూడా విద్యుత్ వినియోగం పెరగడంతో, దానిని భర్తీ చేసేలా చర్యలు చేపట్టడం విద్యుత్ బోర్డు అధికారులకు సవాలుగా మారింది.

తిరునల్వేలిలో బైకును ఢీకొన్న లారీ

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి



ప్రమాదస్థలంలో విచారణ జరుపుతున్న పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా తచ్చనల్లూరు నార్త్ బైపాస్ రోడ్డు వద్ద ఓ బైకును ట్యాంకర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. తిరునల్వేలి జిల్లా రామయన్‌పట్టికి చెందిన కన్నన్ (40), భార్య వసంతి, కుమార్తెలు మారీశ్వరి (12), సమీరా (7)తో గంగైకొండాన్ సమీపం రాజపతి ప్రాంతంలో నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం కన్నన్ తన ఇద్దరు కుమార్తెలను, అత్తగారైన ఆండాళ్ (67)ను బైకుపై ఎక్కించుకుని తిరునల్వేలి బయలుదేరాడు. తచ్చనల్లూరు నార్త్ బైపాస్ రోడ్డులో చేరన్ మాదేవి నుండి తిరునల్వేలికి వస్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ఈ దుర్ఘటనలో కన్నన్ సహా నలుగురూ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న తచ్చనల్లూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో అరగంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

నీటమునిగి..

నలుగురు చిన్నారుల మృతి

ఐసిఎఫ్, సెప్టెంబరు 17: తిరువణ్ణామలై జిల్లాలో నీట మునిగి నలుగురు చిన్నారులు మృతిచెందిన ఘటన విషాదం నింపింది. ఆరణిసమీపం అడయాపులం గ్రామానికి చెందిన మోహన్‌రాజ్ (13), వర్ష (9), కార్తీక (8), తాన్షిక (4) మంగళవారం పాఠశాలకు సెలవు కావడంతో సమీపంలోని ఓడైతాంగల్ చెరువులో స్నానానికి వెళ్లారు. ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లిన నలుగురు నీటమునిగారు. గ్రామస్తుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరకున్న పోలీసులు, చెరువులో గాలించి నలుగురి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతులు రెండు కుటుంబాలకు చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టీటీడీ చెన్నై ఏఈవోగా పార్థసారథి



చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న టి.నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈవో)గా కెపార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. 2016-2018లో కూడా ఆయన చెన్నై ఆలయంలో బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం తిరుమలకు వెళ్లిన ఆయన.. మళ్లీ చెన్నైకి బదిలీపై వచ్చారు.

పెరియార్‌కు నేతల ఘననివాళి



అన్నాసాలైలోని విగ్రహం వద్ద పెరియార్‌కు నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, ఎంపీలు

ప్యారీస్, సెప్టెంబరు 17: ద్రావిడ ఉద్యమనేత తందై పెరియార్ 146వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. అన్నాసాలై సింప్సన్ జంక్షన్‌లో ఉన్న పెరియార్ విగ్రహానికి ముఖ్యమంత్రి స్టాలిన్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, మేయర్ ప్రియ సహా డీఎంకే జిల్లా కార్యదర్శులు, వివిధ విభాగాల నిర్వాహకులు పాల్గొన్నారు. సేలం పట్టణంలోని పెరియార్ విగ్రహానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అంజలి ఘటించారు. మాజీ మంత్రి సెమ్మలై, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటాచలం, ఎమ్మెల్యే బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆ పార్టీ తరఫున ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు డి.జయకుమార్, వలర్మతి తదితరులు సింప్సన్ జంక్షన్‌లో నివాళులర్పించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై పెరియార్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, సీనియర్ నేత జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు షణ్ముగం, జిల్లా కార్యదర్శి జి.సెల్వం తదితరులు నివాళులర్పించారు. డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, పెరుంతలైవర్ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎన్నార్ ధనపాలన్ నివాళులర్పించారు. వెప్పేరిలోని పెరియార్ స్మారక స్థలంలో ఉన్న ఆయన సమాధిపై తమిళగ వెట్రి కళగం తరఫున విజయ్, బుస్సీ ఆనంద్ తదితరులు పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.





దిండివనంలో పీఎంకే అధినేతలు రాందాస్, అన్బుమణి.. - సేలంలో పెరియార్ విగ్రహానికి అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి.. - వెప్పేరిలోని పెరియార్ స్మారక స్థలంలో టీవీకే నేత విజయ్ నివాళులు

కేరళలో నిఫా వైరస్ వ్యాప్తి..

సరిహద్దుల్లో వైద్యసిబ్బంది అప్రమత్తం



కేరళ నుంచి కారులో వస్తున్న వారికి థెర్మోస్కాన్ చేస్తున్న వైద్యసిబ్బంది

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేరళలో నిఫా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కేరళ సరిహద్దు ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తీవ్ర నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. ఆ మేరకు కోయంబత్తూరు - కేరళ సరిహద్దుకు చేరువగా ఉన్న వళయార్, వేలందావళం, మేల్‌పావి, ముళ్లి, మీనాక్షిపురం, గోపాలపురం, సెమ్మనాంబది, వీరప్పగౌండన్‌పుదూరు, నడుప్పుని, జమీన్‌కాళియాపురం, వట్టకాడ తదితర ప్రాంతాల్లో 13 చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్యశాఖ అధికారులు తాత్కాలిక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. కేరళ నుండి కోయంబత్తూరుకు కారు, బస్సు తదితర వాహనాల్లో వచ్చే ప్రతి ఒక్కరినీ జ్వర పరీక్షలు జరిపినమీదటే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. అంతేకాకుండా కేరళ నుండి వస్తున్న వాహనాలపై క్రిమిసంహారక మందులు కూడా పిచికారీ చేస్తున్నారు. ఈ విషయమై కోయంబత్తూరు జిల్లా వైద్యాధికారి ఒకరు మాట్లాడుతూ.. కేరళలో నిఫా వైరస్ వ్యాపిస్తోందని, దీనితో జిల్లా అంతటా 13 చెక్‌పోస్టుల వద్ద వైద్యబృందాలు ఏర్పాటు చేసి కేరళ నుండి వచ్చే వారికి వైద్యపరీక్షలు జరిపిన తర్వాతే రాష్ట్రంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తున్నామని చెప్పారు. ఈ శిబిరాలలో వైద్య సిబ్బంది షిఫ్ట్ పద్ధతిన 24 గంటల పాటు పనిచేస్తారని ఆయన వివరించారు.

సమాచార దర్శిని

కల్పాక్కంలో ఐటీఐ విద్యార్థులకు శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 17: అణుశక్తి శాఖ ఆధ్వర్యంలో, కల్పాక్కంలో ఇందిరా గాంధీ అణు పరిశోధన కేంద్రం పనిచేస్తోంది. ఐటీఐ పూర్తిచేసిన 198 మందికి ఈ కేంద్రంలో ఏడాది ట్రేడ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, మెకానికల్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్ సహా పలు కోర్సుల్లో ఉపకారవేతనంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు http://www.igcar. gov.in/recruitment.html అనే వెబ్‌సైట్‌లో అక్టోబరు 13వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేవీలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, సెప్టెంబరు 17: భారత నావికాదళంలో ఏవియేషన్ అధికారి, హైడ్రోగ్రాఫర్, పైలెట్ విభాగ అధికారులు, సాంకేతిక నిపుణులు మొత్తం 250 పోస్టులు భర్తీ చేయనున్నారు. యూజీ, పీజీ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన పట్టభద్రులు ఈ నెల 29వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు కొన్ని సడలింపులుంటాయి. విద్యార్హత, దేహదారుఢ్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు www.join indiannavy. gov.inఅనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

20న ప్రైవేటు కంపెనీల ఉద్యోగ మేళా

పెరంబూర్, సెప్టెంబరు 17: చెంగల్పట్టు కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో చిన్నతరహా ప్రైవేటు శాఖ జాబ్ మేళా ఈ నెల 20వ తేది జరుగనుంది. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా యంత్రాంగం, జిల్లా ఉద్యోగావకాశాలు, మార్గదర్శకాల కేంద్రం ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా జరుగనుంది. ఈ మేళాలో 50కి పైగా ప్రైవేటు సంస్థలు సుమారు 5,000 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 8వ తరగతి నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు 044-27426020, 6383460933 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రామలింగేశ్వరాలయంలో 20న దీప పూజ

పెరంబూర్, సెప్టెంబరు 17: కాంచీపురం సమీపం తిమ్మరాజంపేట గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయం ఉంది. ఈ ఆలయంలో ఈ నెల 20వ తేది సాయంత్రం 6 గంటలకు దీప పూజ జరుగనుంది. ఈ సందర్భంగా, రామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్,సెప్టెంబరు17: జీఎం అకాడమీ ఆధ్వర్యంలో శాన్ అకాడమీ రెండవ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు శాన్ అకాడమీ ప్రాంగణంలో ఈ నెల 22వ తేది జరుగనున్నాయి. 8,10,13,25 ఏళ్ల విభాగాలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు 'ఫిడే' నిబంధనలతో 'స్విస్' ప్రాతిపదికన జరుగుతాయి. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 20వ తేది రాత్రి 10 గంటల్లోపు పేర్లు నమోదుచేసుకోవాలి. వివరాలకు 9941514097, 8838229938 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

పెరుంబాక్కం ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్లు

పెరంబూర్, సెప్టెంబరు 17: స్థానిక పెరుంబాక్కంలోని ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలలో విద్యార్థులు నేరుగా వచ్చి అడ్మిషన్ పొందవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ తమిళం, బీఏ ఆంగ్లం, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మ్యాథ్స్, బీసీఏ, బీకాం, బీఏ కార్పొరేట్ సెక్రటరీషిప్ సహా పలు కోర్సుల్లో ఖాళీ సీట్లున్నాయి. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు తగిన సర్టిఫికెట్లతో కళాశాలను సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 'తమిళ్‌పుదల్వన్' పథకంలో నెలకు రూ.1,000, విద్యార్థినులకు 'పుదుమై పెన్' పథకంలో నెలకు రూ.1,000 అందజేయనున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సమావేశం

వేలూరు, సెప్టెంబరు 17: స్థానిక సత్తువాచేరి వళ్లలార్‌లో తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘా ల కార్యాలయంలో మంగళవారం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. జిల్లా కార్యకర్తల కమిటీ అధ్యక్షుడు రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాజవేలు పా ల్గొన్నారు. సంఘ నిర్వాహకులు సంపత్ ఆహ్వానం పలికిన ఈ సమావేశంలో మునుస్వామి, తాండవమూర్తి, ముత్తుస్వామి, బాలకృష్ణన్, మదనకుమార్ తదితరులు పాల్గొనగా, జిల్లా ఉపాధ్యక్షులు జయపాల్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

తిరువణ్ణామలైకు పోటెత్తిన భక్తులు

● దర్శనం కోసం 5 గంటలకు

అడయార్, సెప్టెంబరు 17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. పురటాసి మాసం పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనం చేసుకునేందుకు భక్తులు భారీగా వచ్చారు. దీంతో అరుణాచలేశ్వరుడి దర్శనం కోసం కనీసం ఐదునుంచి ఆరుగంటల సమయం పట్టింది. పురటాసి మాస పౌర్ణమి మంగళవారం ఉదయం 11 గంటల 22 నిమిషాలకు నుంచి ప్రారంభమైంది. ఆలయాన్ని మంగళవారం వేకువజామున 4 గంటలకే తెరిచి మహాదీపారాధన, ఇతర పూజలు చేశారు. సాధారణంగా పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తిరువణ్ణామలై వస్తుంటారు. పురటాసి మాసం పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తిరువణ్ణామలై జిల్లా కేంద్రం కిటకిటలాడింది. ఇదిలావుంటే, పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర రవాణా సంస్థ చెన్నై నుంచి తిరువణ్ణామలైకు 1500 ప్రత్యేక బస్సులు నడుపింది. అలాగే, ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో బస్సు సర్వీసులు నడిపేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది.

తిరుత్తణి సమీపంలో దొంగకు దేహశుద్ధి

ప్యారీస్, సెప్టెంబరు 17: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలో ఇళ్లు, దుకాణాల్లో చోరీలు చేసిన ఓ యువకుడిని విద్యుత్ స్తంభానికి కట్టేసి స్థానికులు దేహశుద్ధి చేశారు. మనవూరు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు దుకాణాల తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి సెల్‌ఫోన్ తదితర విలువైన పరికరాలు దొంగిలించిన దృశ్యం ఆ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి తన సీసీ కెమెరాలో చూసి వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. దీంతో గుమిగూడిన ప్రజలు గోవిందరాజన్ అనే వ్యక్తిని బంధించి చితకబాది పోలీసులకు అప్పగించారు.

ఉత్తరాఖండ్ నుంచి చెన్నై చేరుకున్న 17 మంది భక్తులు



ఉత్తరాఖండ్ తీర్థయాత్రకు వెళ్లిన తమిళ భక్తులు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ ఆదికైలాశ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో చిక్కుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న రాష్ట్రానికి చెందిన 17 మంది భక్తులు సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. కడలూరు జిల్లా చిదంబరం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కనకరాజ్ సహా 24 మంది, సీర్గాళికి చెందిన ఇద్దరు ఓ బృందంగా ఉత్తరాఖండ్‌లోని ఆదికైలాశ్ ఆధ్యాత్మిక యాత్రకు ఈ నెల ఒకటిన వెళ్లారు. వీరితోపాటు కోవైకి చెందిన ఇద్దరు, బెంగళూరులో పనిచేస్తున్న చిదంబరం ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు కలిసి మొత్తం 30 మంది ఢిల్లీ నుండి రెండు వ్యాన్లలో మూడో తేదీ బయలుదేరి తొమ్మిదో తేదీ ఉత్తరఖాండ్ చేరుకున్నారు.పిత్రోఘర్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో రాష్ట్రంనుంచి వెళ్ళిన 30 మంది ఇబ్బందులకు గురయ్యారు. అక్కడి నారాయణ ఆశ్రమంలో బస చేశారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి తగు చర్యలు చేపట్టారు. 30 మంది భక్తులను సురక్షితంగా స్వస్థలానికి చేర్చేందుకు అన్ని సదుపాయాలు కల్పించారు. దీంతో ఆదివారం 30 మంది హెలికాప్టర్ ద్వారా తట్టుల అనే ప్రాంతానికి తరలించి, వారికి ఆహారం, దుస్తులు సమకూర్చారు. వైద్యపరీక్షలు కూడా జరిపారు. అనంతరం సోమవారం ఉదయం రెండు వ్యాన్లలో వారంతా బయలుదేరి ఢిల్లీ చేరుకున్నారు. అక్కడి నుంచి కోవైకి చెందిన ఇద్దరు, బెంగళూరులో పనిచేస్తున్న ఇద్దరు, చిదంబరం ప్రాంతానికి చెందిన 17 మంది విమానంలో చెన్నై చేరుకున్నారు. మరో 13 మంది మంగళవారం ఉదయం ఢిల్లీ నిజాముద్దీన్ రైలులో బయలుదేరారు. వీరంతా బుధవారం మధ్యాహ్నం నగరానికి చేరుకుంటారని ప్రభుత్వాధికారులు చెబుతున్నారు. వీరికి మంత్రి సెంజి మస్తాన్ స్వాగతం పలికి ముఖ్యమంత్రి స్టాలిన్ వద్దకు తీసుకెళ్లనున్నారు.

పండుగ సీజన్‌పై ప్రత్యేక దృష్టి

లీజుకు ప్రైవేటు బస్సులు ● రవాణా శాఖ అధికారుల నిర్ణయం

అడయార్, సెప్టెంబరు 17: పండుగలు ఇతర ప్రత్యేక రోజుల్లో ప్రయాణికుల రద్దీని నివారించేందుకు ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకుని నడపాలని రవాణా శాఖ అధికారులు భావిస్తున్నారు. పండుగ రోజులు, వరుస సెలవుదినాల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటుంది. రైళ్ళు, ప్రభుత్వ బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. ఈ రద్దీ కారణంగా అనేక మంది తమ సొంతూళ్ళకు వెళ్ళలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకుని పండుగ రోజుల్లో నడపాలని అధికారులు నిర్ణయించారు. ఇలా అద్దెకు తీసుకునే బస్సుల నిర్వహణ, డ్రైవర్ ఖర్చులను ప్రైవేటు బస్సు యాజమాన్యం భరించేలా, ప్రయాణ చార్జీ వసూలు చేసేందుకు కండక్టర్‌ను నియమించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానంలో లీజుకు తీసుకునే బస్సులకు నెలకొకసారి అద్దె చెల్లించాలని భావిస్తున్నారు. ఇలా లీజుకు తీసుకునే బస్సులను చెన్నై సహా తొమ్మిది ఉత్తరాది జిల్లాలకు నడపాలని భావిస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు పుదుచ్చేరిలో బంద్

పుదుచ్చేరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో బుధవారం బంద్ జరుగనుంది. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలన్న డిమాండ్‌తో ఈ బంద్ పాటిస్తున్నట్లు ఇండియా కూటమి నేతలు ప్రకటించారు. తమ బంద్‌కు పుదుచ్చేరి ప్రజలతో పాటు అన్ని వ్యాపార సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని వారు వెల్లడించారు. పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల విద్యుత్ చార్జీలను పెంచింది. ఈ చార్జీల పెంపును విపక్ష పార్టీల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ నెల 2వ తేదీ సచివాలయాన్ని ముట్టడించారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం మొదటి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించింది. అయితే, విపక్షాలు మాత్రం పెంచిన విద్యుత్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలన్న డిమాండ్‌తో బుధవారం బంద్‌కు పిలుపునిచ్చాయి.

గ్రామాలు దత్తత తీసుకుని మొక్కలు నాటండి

పెరంబూర్, సెప్టెంబరు 17: గ్రామాలు దత్తత తీసుకుని విద్యార్థినీ, విద్యార్థుల ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశించింది. కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది చివరి నాటికి 140 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవమైన జూన్ 5వ తేది 'తల్లికి ఓ చెట్టు' అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 50 కోట్ల మొక్కలు నాటారు. మిగిలిన 80 కోట్ల మొక్కలు నాటే పనులను మంత్రిత్వ శాఖ చేపట్టింది. అందులో భాగంగా విద్యాసంస్థలు తమ సమీపంలోని గ్రామాలు దత్తత తీసుకొని విద్యార్థినీ, విద్యార్థుల ద్వారా మొక్కలు నాటాలని యూజీసీ సర్క్యులర్ జారీచేసింది.

'మీ టెక్నికల్ ఎర్రర్' ఎప్పుడు ముగుస్తుంది

● సీపీఎం ఎంపీ వెంకటేశన్

ఐసిఎఫ్, సెప్టెంబరు 17: 'మీ టెక్నికల్ ఎర్రర్ ఎప్పుడు ముగుస్తుందని కేంద్ర ప్రభుత్వానికి మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ ప్రశ్నించారు.మదురై ఎయిమ్స్ టెండర్లలో టెక్నికల్ ఎర్రర్ ఉందంటూ కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఇటీవల పేర్కొన్నారు.దీనిపై ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్‌లో ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రమే టెక్నికల్ ఎర్రర్‌లు ఎలా వస్తున్నాయి? అంటూ ఛలోక్తి విసిరారు.

అధికారిపై చర్యలు కోరుతూ హాస్టల్ విద్యార్థినుల నిరసన



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్తున్న విద్యార్థినులు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమను కించపరిచేలా దుర్భాషలాడిన విరుదునగర్ జిల్లా ఆదిద్రావిడ సంక్షేమ విభాగం అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థినులు కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన జరిపారు. విరుదునగర్ జిల్లా శివకాశి ఆదిద్రావిడుల సంక్షేమశాఖ బాలికల వసతిగృహం ఉంది. ఇందులో విద్యార్థినులు బస చేసి చదువుతున్నారు. ఈ నెల 13న తమ వసతి గృహాన్ని తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ విభాగం అధికారి తమను, తల్లిదండ్రులకు కించపరిచేలా దుర్భాషలాడారని ఆరోపించారు. ఆ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విరుదునగర్ జిల్లా కలెక్టర్ జయశీలన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు.

రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యకర్తల సమావేశం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

వేలూరు, సెప్టెంబరు 17: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని టౌన్ హాలులో మంగళవారం రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశం, జరిగింద. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యశీలన్, ఉపాధ్యక్షులు మురుగేశన్, ప్రధాన కార్యాలయ సెక్రటరీ నలన్, గుణశేఖరన్, రాష్ట్ర, జిల్లా మహిళా నిర్వాహకులు పాల్గొన్నారు.

దివ్యమైన ప్రేమతో ఆరాధించడమే భక్తి మార్గం

● బిషప్ దేవదాస్ పాత్ర



డాక్టరేట్, రెవ, ప్రీస్ట్ పట్టా గ్రహీతలతో దేవదాస్ పాత్ర తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 17: దివ్య ప్రేమతో భగవంతుడిని ఆరాధించేది భక్తి మార్గమని సిమ్ డయోసిస్ బిషప్ డా.దేవదాస్ పాత్ర పేర్కొన్నారు. విల్లివాక్కం అన్నై థెరిస్సా నగర్‌లో సేఫ్ ఇండియా మిషనరీ డయోసిస్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం డాక్టరేట్, రెవరెండ్, ప్రీస్ట్ తదితర పట్టాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన దేవదాస్ పాత్ర, ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంతర్జాతీయ టీవీ ప్రసంగీకులు మంజు దేవరపల్లి, డయోసిస్ సేవలను సభకు వివరించారు. అనంతరం వారు రెవ.ఎన్.దేవన్న, తెలంగాణకు చెందిన రెవ.ఎం.పద్మారావులకు డాక్టరేట్, రెవ.డేవిడ్ అంతోనీకి లే లీడర్, కర్ణాటకకు చెందిన ప్రవీన్ రామంచకు వికార్ జనరల్, సీనియర్ బోధకులు రవి, రాజ్‌కుమార్‌లకు ప్రీస్ట్ అవార్డులు అందజేసి అభిషేకించారు. ఈ సమావేశం బీసీ క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను కోరింది. కార్యక్రమంలో డా.దయాపాత్ర, డి.శాంతకుమార్, రిచర్డ్ దేవదాస్, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

2026లో కూటమి పాలన సాధ్యంకాదు

● ఈవీకేఎస్ ఇళంగోవన్

అడయార్, సెప్టెంబరు 17: రెండేళ్లనంతరం జరిగే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి పాలన సాధ్యం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ అభిప్రాయపడ్డారు. తందై పెరియార్ 146వ జయంతిని పురస్కరించుకుని ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలోని పెరియార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ పార్టీ స్థాపించకుండానే పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నారు.ఆ తర్వాత పార్టీని స్థాపించి 2026లోనే అధికారాన్ని కైవసం చేసుకుంటామంటూ ప్రకటిస్తున్నారనీ, ఇలాంటి నేపథ్యంలో డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరడంలో తప్పులేదన్నారు. నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ వంటివారు తమిళనాడులోనే కాకుండా కేరళలో కూడా అధికారంలోకి వస్తామని ప్రకటిస్తున్నారని గుర్తు చేశారు. అయితే, 2026లో కూటమి పాలన అనేది సాధ్యంకాదన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధాన్ని అమలు చేయాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మద్యనిషేధం విధించి, కల్లు విక్రయాలు ప్రోత్సహించాలని, ఇలా చేయడం వల్ల గీత కార్మికులకు జీవనోపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

నీలగిరుల్లో అడవి ఏనుగుల సంచారం

● భీతిల్లుతున్న వాహన చోదకులు



కోవై - మంజూరు రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగులు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గత కొద్ది రోజులుగా వన్యమృగాలు అడవుల నుండి వచ్చి జనావాస ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. నీరు, ఆహారం కోసం ఆ జంతువులు కొండదిగువనున్న నివాసాల్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఊటీ నుంచి మంజూరు మీదుగా కోవై వెళ్లే రహదారిలో ఓ పెద్ద ఎలుగుబంటిని చూసి వాహన చోదకులు భీతిల్లారు. ఈ నేపథ్యంలో మంజూరు నుంచి కోయంబత్తూరు వెళ్లే రహదారిలో అడవి ఏనుగులు గుంపుగా రోడ్డులో సంచరించటంతో వాహన చోదకులు దిగ్భ్రాంతి చెందారు. ఆ రహదారి చాలా ఇరుకుగా ఉండటంతో వాహన చోదకులు హారన్ కొట్టినా అవి కదలడం లేదు. సుమారు రెండు గంటలపాటు ఆ ఏనుగులు రోడ్డుపై సంచరిస్తూ వాహనాల రాకపోకలకు అడ్డుగా నిలిచాయి. ఆ తర్వాత అడవిలోకి వెళ్లటంలో వాహనాలు కదిలాయి. నీలగిరి రహదారుల్లో ప్రస్తుతం ఏనుగుల సంచారం అధికంగా ఉందని వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని హైవే అధికారులు హెచ్చరిస్తున్నారు.

పెరుంబాక్కంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ఇళ్లలో తనిఖీలు చేపట్టిన పోలీసులు

పెరంబూర్, సెప్టెంబరు 17: స్థానిక పెరుంబాక్కంలోని గృహాల్లో మంగళవారం తెల్లవారుజామున సుమారు 300 పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ ప్రాంతంలోని తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు గృహ సముదాయంలో సుమారు 20 వేలకు పైగా కుటుంబాలు నివశిస్తున్నాయి. ఈ సముదాయంలో మాదకద్రవ్యాలు, గంజాయి. నిషేధిత పొగాకు ఉత్పత్తులు దాచారని పళ్లికరనై పోలీసులకు సమాచారం అందింది. దీంతో, మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో పళ్లికరనై డిప్యూటీ కమిషనర్ కార్తికేయన్, అసిస్టెంట్ కమిషనర్ క్రిస్టిన్ జయశీల్, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 21 మంది అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసులు మొత్తం 300 మంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇళ్లలోని పాత్రలు, దుస్తులు, బ్యాగులు, అల్మారాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో గంజాయి, గుట్కా, పలు పొగాకు ఉత్పత్తులు, నాలుగు కత్తులు సహా పలురకాల మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మేల్ విశారంలో మినరల్స్ కర్మాగారం ప్రారంభం



కర్మాగారం ప్రారంభిస్తున్న నారాయణి పీఠం డైరెక్టర్ డా.సురేష్‌బాబు

వేలూరు, సెప్టెంబరు 17: స్థానిక మేల్‌విశారంలో మంగళవారం సాయి మినరల్స్ కర్మాగారం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీపురం నారాయణి పీఠం డైరెక్టర్, ట్రస్టీ డా.సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే జ్ఞానశేఖరన్ తదితరులు పాల్గొని జ్యోతి వెలిగించారు. వేలూరు రియల్టర్ దినేష్‌కుమార్ జైన్, మేల్‌విశారం సాయి మినరల్స్ పరిమళ రామమూర్తి, సత్తువాచ్చేరి శక్తి అమ్మ ఆస్పత్రి డాక్టర్ కార్తికేయన్, వేలూరు జయశ్రీ జ్యువెలర్స్ ధర్మచంద్ జైన్, లావణ్య శరవణన్, సురేష్ రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయాల పంపిణి

వేలూరు, సెప్టెంబరు 17: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్షేమ సహాయాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి జిల్లా గవర్నర్ సురేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో 200 మంది అంధులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దేవదాస్, షాత్‌మిన్‌రాజా, ఆర్ముగం, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సహాయాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఉపాధి పేరుతో విదేశీ యువతితో వ్యభిచారం

● ప్రియుడి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 17: ఉపాధి పేరుతో ఒక విదేశీ యువతిని ఆమె ప్రియుడు మోసగించడమేకాకుండా, వ్యభిచారంలోకి దించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువతికి త్రిపుర రాజధాని అగర్తాలకు చెందిన మహ్మద్ యాసిన్ మియా అనే యువకుడితో ఆన్‌లైన్ ద్వారా పరిచయమైంది. అప్పటి నుంచి వారిద్దరూ ప్రేమలో ఉన్నారు. ఈ క్రమంలో ఇటీవల బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు కారణంగా అనేక మంది ఉపాధి కోల్పోయారు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న మహ్మద్ యాసిన్.. తన ప్రియురాలిని త్రిపురకు రప్పించి, అక్కడ నుంచి ఉపాధి కోసం చెన్నై తీసుకొచ్చాడు. మహ్మద్ యాసిన్‌తో పాటు అతడి స్నేహితులు, బంగ్లా యువతి కలిసి వేళచ్చేరిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ యువతితో వ్యభిచారం చేయించేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం ఆమెపై ఒత్తిడి చేయడంతో పాటు చిత్రహింసలకు గురిచేసినప్పటికీ ఆ యువతి నిరాకరించింది. ఆ తర్వాత ఆ ముఠా నుంచి తప్పించుకుని గిండి మహిళా పోలీసుల వద్ద తన గోడు వెళ్ళబోసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మహ్మద్ యాసిన్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న యాసిన్ స్నేహితులు త్రిపురకు చెందిన కపిల్, రుంకీ కోసం గాలిస్తున్నారు.

పోస్టల్ ఉద్యోగి ఇంట్లో దోపిడీ

వేలూరు, సెప్టెంబరు 17: అరక్కోణం సమీపం చిన్నకైనూర్ గ్రామానికి చెందిన కుమరేశన్ పోస్టాఫీసులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం ఇంటికి తాళం వేసి షోలింగర్‌లోని బంధువుల ఇంటి శుభకార్యానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, తలుపులు బద్దలుకొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. లోనికి వెళ్లి చూడగా, బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి వున్నారు. బీరులో ఉంచిన 48 సవర్ల నగలు, రూ.55 వేల నగదు, 250 గ్రాముల వెండి సామానులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదుతో అరక్కోణం నగర పోలీసులు అక్కడకు చేరుకొని విచారించారు. అదే సమయంలో బీరువా లాకర్‌లో ఉంచి 9 సవర్ల నగలు అలాగే ఉన్నాయి.

గంజా వ్యాపారికి 12 ఏళ్ల జైలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 17: నగర శివారు ప్రాంతం రెడ్‌హిల్స్‌లో గంజాయి తరలిస్తున్న కేసులో శ్రీనివాసన్‌కు 12 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మింట్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ నుంచి పోలీసులు 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తన తప్పు అంగీకరించడంతో, అతనికి 12 ఏళ్ల జైలు, రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

ముగ్గురు శ్రీలంక జాలర్ల అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సముద్ర సరిహద్దు జలాల్లోకి అక్రమంగా చొరబడిన ముగ్గురు శ్రీలంక జాలర్లను సముద్రతీర భద్రతా విభాగం అరెస్టు చేసింది. రామనాథపురం జిల్లా తొండి సముద్రతీరం వద్ద అనుమానాస్పదంగా ఫైబర్ పడవలో సంచరిస్తున్న ముగ్గురు శ్రీలంక జాలర్లను సముద్రతీర భద్రతా దళం అదుపులోకి తీసుకుంది. శ్రీలంకకు చెందిన ఆ ముగ్గురు జాలర్లు హింసాత్మక సంఘటనలు జరిపేందుకు వచ్చారా అనే కోణంపై కూడా విచారణ జరుపుతున్నారు.

డాక్టర్ కాంతరాజ్ వద్ద సైబర్ క్రైమ్ విచారణ

అడయార్, సెప్టెంబరు 17: తమిళ చిత్రపరిశ్రమకు చెందిన హీరోయిన్లను కించపరిచేలా, అసభ్యంగా మాట్లాడిన వ్యవహారంపై డాక్టర్ కాంతరాజ్‌ను చెన్నై సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం విచారణ జరిపారు. నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన విశాఖ కమిటీ అధ్యక్షురాలు నటి రోహిణి ఫిర్యాదు మేరకు పోలీసులు డాక్టర్ కాంతరాజ్‌పై కేసు నమోదు చేశారు. దీంతో అతడిని సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ జరిపారు. ఈ కేసులో అతడిని అరెస్టు చేసే విషయంపై పోలీసులు న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నారు. కాగా, ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ కాంతరాజ్ హీరోయిన్లను కించపరిచేలా వ్యాఖ్యానించిన విషయం తెల్సిందే.

ఒంటరి వృద్ధురాలి హత్య

● కల్పాక్కం సమీపంలో దారుణం

అడయార్, సెప్టెంబరు 17: కాంచీపురం జిల్లా కల్పాక్కం సమీపంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు దారుణ హత్యకుగురైంది. బంగారు నగలు, నగదు కోసం ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. కల్పాక్కం సమీపంలోని పంబరాజపురం, పెరియపాళయత్తమ్మన్ ఆలయ వీధికి చెందిన కన్నియమ్మాళ్ (70) అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటున్నారు. ఈమె భర్త కొన్ని నెలల క్రితం మరణించారు. దీంతో తన ఇంటి దగ్గర ఇడ్లీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కన్నియమ్మాళ్ ఎంతకీ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగువారు అనుమానించి చూడగా, కన్నియమ్మాళ్ వంటగదిలో హత్యకు గురైవుండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కన్నియమ్మాల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో చిన్న కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కన్నియమ్మాళ్‌ను బంగారు నగలు, నగదు కోసం హత్య చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా, మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరుకుమార్తెలున్నారు.

క్రికెట్ ఆడుతూ యువకుడి మృతి



మృతుడు బాలాజి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 17: క్రికెట్ ఆడుతున్న యువకుడు హఠాత్తుగా స్పృహతప్పి మృతిచెందిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటుచేసుకుంది. ఉత్తర మేరూర్ సమీపం కన్నకొళత్తూర్ ప్రాంతానికి చెందిన బాలాజీ (32) రెండు రోజుల క్రితం మామ ఊరైన నెలంబూర్ వచ్చాడు. నెలంబూర్, కీల్‌సేవూరు గ్రామాల యువకుల మధ్య క్రికెట్ మ్యాచ్ గత ఆదివారం జరిగింది. క్రికెట్ అంటే ఆసక్తి ఉన్న బాలాజి నెలంబూర్ టీమ్‌లో ఆడాడు. బౌలింగ్ వేసేందుకు వెళ్తున్న బాలాజి హఠాత్తుగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. సహచరులు వెంటనే అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం దిండువనం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ, మార్గమధ్యంలో అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హిజ్రా దరఖాస్తు తోసిపుచ్చరాదు

● మద్రాసు హైకోర్టు

ప్యారీస్, సెప్టెంబరు 17: వెటర్నరీ కోర్సు చదువుకునేందుకు హిజ్రా సమర్పించిన దరఖాస్తు తోసిపుచ్చరాదని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. 2024-25వ విద్యా సంవత్సరానికి సంబంధించి వెటర్నరీ కోర్సు అడ్మిషన్లపై విడుదల చేసిన ప్రకటనలో... తృతీయ ప్రవృత్తి కలిగిన హిజ్రాల గురించి ప్రస్తావించలేదంటూ నివేద అనే హిజ్రా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును న్యాయమూర్తి దండపాణి విచారణకు స్వీకరించగా, పిటిషనర్ తరఫు న్యాయవాది హాజరై, నివేద దాఖలుచేసిన దరఖాస్తును పరిశీలించాల్సిందిగా ఉత్తర్వులు జారీచేయాలని అభ్యర్థించారు. ఇరుతరపు వాదనల అనంతరం రెండు వారాల్లోగా నివేద దరఖాస్తు పరిశీలించి తగిన ఉత్తర్వులివ్వాలని బీవీఎస్సీ విద్యార్థుల అడ్మిషన్ కమిటీకి ఉత్తర్వులు జారీచేశారు.

ఉద్యమ నేతలకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న పీఎంకే నేతలు, కార్యకర్తలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 17: రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ జరిగిన ఆందోళనల్లో ప్రాణాలు విడిచిన నేతలకు పీఎంకే ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు. పల్లావరం సమీపంలోని పమ్మల్ కృష్ణానగర్ బస్టాండ్ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, ఉద్యమ నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పమ్మల్ పార్టీ కార్యదర్శి రంగనాథన్, చెంగల్పట్టు పశ్చిమ జిల్లా కార్యదర్శి కరుప్పుస్వామి, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ ఎస్.కన్నన్, జిల్లా కార్యదర్శి పమ్మల్ ఎస్.రాహుల్, జిల్లా సంయుక్త కార్యదర్శి పూక్కడై ముత్తుస్వామి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమలో భాగంగా ఆ ప్రాంతంలో పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పేనాలు అందజేసి, ప్రజలకు అన్నదానం చేశారు.

ఆహ్లాదకరంగా సాగే యాక్షన్ చిత్రం 'హిట్లర్'



ఆడియో రిలీజ్ వేడుకలో 'హిట్లర్' చిత్ర బృందం

● విజయ్ ఆంటోనీ

తాను హీరోగా నటించిన కొత్త చిత్రం 'హిట్లర్'.. ఆహ్లాదకరంగా సాగిపోయే యాక్షన్ భరిత సినిమా అని హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. చెందూర్ ఫిలిమ్స్ పతాకంపై టీడీ రాజా నిర్మించిన ఈ చిత్రానికి ధనా దర్శకుడు. ఈ నెల 27న విడుదలకానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆడియో రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోనీ సరసన రియా సుమన్ నటించగా, సీనియర్ దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్, చరణ్ రాజ్, రెడిన్‌కింగ్స్లే, వివేక్ ప్రసన్న, తమిళ్, ఆడుకలం నరేన్ తదితరులు నటించారు. ఆడియో రిలీజ్ వేడుకలో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'గౌతం మేనన్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. గతంలో ఓ ప్రాజెక్టు విషయమై ఆయనను సంప్రదించాను. ఇపుడు ఈ చిత్రంలో కలిసి పనిచేశాను. సినిమాను దర్శకుడు ధనా అద్భుతంగా తెరకెక్కించారు. సంగీత దర్శకుడు వివేక్ మెర్విన్ అభిమానిని. ఎన్నో అవాంతరాలను అధిగమించి టీడీ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఎంతో ఆహ్లాదకరంగా సాగిపోయే యాక్షన్ సినిమా. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. దర్శకుడు ధనా మాట్లాడుతూ, 'ఒక మంచి యాక్షన్ చిత్రం. ఇద్దరు మేటి నటులతో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. నిర్మాత రాజా ఎంతగానో సహకరించారు. కమర్షియల్ యాక్షన్ చిత్రంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. సుదీర్ఘ విరామం తర్వాత చరణ్ రాజ్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 27న విడుదల చేస్తున్న తమ చిత్రానికి మీడియా సపోర్టు చేయాలని కోరారు. నిర్మాత టీడీ రాజా మాట్లాడుతూ, 'మా బ్యానరుపై నిర్మించిన ఏడో చిత్రం. విజయ్ ఆంటోనీతో తీసిన 'కోడియల్ ఒరువన్' ఘన విజయం సాధించింది. ఈ సినిమా కూడా తప్పకుండా హిట్ సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. అలాగే, హీరోయిన్ రియా సుమన్, నటుడు వివేక్ ప్రసన్న, నటి ఐశ్వర్య దత్తా, గౌతం వాసుదేవ్ మేనన్ తదితరులు ప్రసంగించారు.

బెడ్రూమ్ సీన్లలో నటించడం అంత ఈజీ కాదు


● మాళవిక మోహనన్

చిత్రజ్యోతి



బెడ్రూమ్, లిప్‌లాక్ వంటి సన్నివేశాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదని హీరోయిన్ మాళవిక మోహనన్ అన్నారు. తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత 'పేట', 'మాస్టర్', 'తంగలాన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది.. హిందీలో ఆమె నటించిన 'యుధ్రా' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాలో అనేక హాట్ హాట్ సన్నివేశాల్లో ఆమె నటించారు. వీటిపై మాళవిక స్పందిస్తూ, 'సినిమాల్లో హాట్ సన్నివేశాల్లో నటించడం అంత ఈజీ కాదు. హీరో హీరోయిన్ల మధ్య మంచి అవగాహనతో పాటు సానుకూల వాతావరణం ఉండాలి. సాధారణంగా ఇలాంటి సన్నివేశాలను లొకేషన్‌లోనే చిత్రీకరించాల్సిన పరిస్థితి వస్తే ఇంటిమేట్ కో ఆర్డినేటర్ అనే టెక్నీషియన్ ఉంటారు. ఇలాంటి సన్నివేశాల్లో నటించేటపుడు నటీనటులు ఎలాంటి సిగ్గు, బెణుకు లేకుండా నటించేందుకు వీరు సహకరిస్తుంటారు. కానీ, మా షూటింగ్ లొకేషన్‌లో ఇలాంటి వారు ఎవరూ లేరు. అయినప్పటికీ 'యుధ్రా' చిత్రంలో ఇలాంటి సన్నివేశాల్లో నటించాను' అని పేర్కొన్నారు.

సుందర్ సి దర్శకత్వంలో నయనతార



స్టార్ హీరోయిన్ నయనతార నటించిన 'మూక్కుత్తి అమ్మన్' చిత్రం రెండో భాగం తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత ఐసరి డాక్టర్ కె.గణేశ్ తన సొంత నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పతాకంపై నిర్మించనున్నారు. 2020లో రేడియో జాకీ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ఈ చిత్రం తొలిభాగం వచ్చింది. ఘనవిజయం సాధించిన ఈ సినిమాలో నయనతార, ఆర్జే బాలాజీ, ఊర్వశి, స్మృతి వెంకట్, మయిల్ సామి, తదితరులు నటించారు. ఇపుడు ఈ సినిమా రెండో భాగాన్ని వేల్స్ నిర్మాణ సంస్థ చేపట్టింది. దర్శకుడుగా సుందర్ ని ఎంపికచేసినట్టు అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. కాగా, సుందర్ దర్శకత్వంలో వచ్చిన 'అరణ్మనై-4' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి రూ.100 కోట్లకుపైగా వసూలు చేసిన విషయం తెల్సిందే. ప్రస్తుతం హాస్య నటుడు వడివేలు హీరోగా 'గ్యాంగర్స్' అనే చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

అంతకుమించిన సంతోషం లేదు



● మారి సెల్వరాజ్

ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను జాతి, కులమతాలకతీతంగా ముస్లిం సోదరులు రక్షించారనే విషయం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్ అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'వాళై' చిత్రం ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 25 డేస్ సక్సెస్ వేడుకలను నగరంలో నిర్వహించారు. ఇందులో ఈ చిత్రంలో నటించిన ప్రతి నటుడికి, సినిమా నిర్మాణంలో పనిచేసిన టెక్నీషియన్‌కు విజయోత్సవ షీల్డ్ బహూకరించారు. ఇందులో దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'వాళై' సినిమాను ఘన విజయం చేసిన ప్రేక్షకులకు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిఖిలా విమల్‌ను నేను దర్శకత్వం వహించిన 'కర్ణన్', 'మామమన్నన్' చిత్రాల్లో నటింపజేసేందుకు ప్రయత్నించాను. అది సాధ్యపడలేదు. 'వాళై' సినిమాతో అది తీరిపోయింది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం ఎంతోబలం. సినిమాలో వచ్చే సన్నివేశాల్లో అనేక మంది తమను చూపించలేదని కోపగించుకుంటున్నారు. ఈ సినిమా నాకు సంబంధించింది. ప్రమాదం జరిగినపుడు ఘటనా స్థలంలో నేను లేను. కానీ, ప్రమాద బాధితులను కులమతాలకు అతీతంగా ముస్లింలే రక్షించారని బాధితులే చెప్పడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'మిలాద్ ఉన్ నబి'



చెన్నై క్యాంపు కార్యాలయంలో మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి సెంజి కేఎస్ మస్తాన్‌కు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్




ట్రిప్లికేన్‌లో శాంతి ర్యాలీ ప్రారంభించి పాల్గొన్న మంత్రి సెంజి మస్తాన్ తదితరులు - కోయంబత్తూర్ ర్యాలీలో ముస్లిం చిన్నారుల సందడి



ప్యారీస్, సెప్టెంబరు 17: ముస్లింలు పరమ పవిత్రంగా భావించే మిలాద్ ఉన్ నబిని భక్తి మంగళవారం శ్రద్ధలతో జరుపుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన ర్యాలీలు మధ్యాహ్నం వరకు సాగాయి. ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు మహ్మద్ ప్రవక్తను గుర్తుచేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వేదికలపై మతపెద్దలు మహ్మద్ ప్రవక్త సూచించిన విధానాలు పాటించాలని సూచించారు. ట్రిప్లికేన్ నియోజకవర్గంలోని పెద్ద మసీదు ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర బీసీల సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తమిళనాడు దర్గాల సమాఖ్య పేరవై ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శాంతి ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమన్నారు. పవిత్ర ఖురాన్, ప్రవక్త చూపిన మార్గాన్ని పాటిస్తూ పేదలకు తమవంతు సహాయం చేయాలని సూచించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే హసన్ మౌలానా, పేరవై నిర్వాహకులు సయ్యద్ యాకూబ్, డా.యాసిన్, సయ్యద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కోయంబత్తూర్ ఉక్కడం కోటమేడు, సెల్వాపురం తదితర ప్రాంతాల్లో ముస్లింలు మతసామరస్యాన్ని చాటుతూ నిర్వహించిన ర్యాలీలో అన్ని మతాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు 'నాతే షరీఫ్' భక్తిగీతాలు ఆలపించారు. ఇండియా హజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పళని పంచామృతం కాలపరిమితి పెంపు

● 15 నుంచి 30 రోజులకు



పెరంబూర్, సెప్టెంబరు 17: పళని పంచామృతం డబ్బాల కాలపరిమితి 15 నుంచి 30 రోజులకు పెంచారు. పళని దండాయుధపాణి ఆలయానికివచ్చే భక్తులకు ఆలయం తరఫున పంచామృతం ప్రసాదంగా అందజేస్తుంటారు. అంతే కాకుండా అభిషేక పంచామృతాన్ని 470 గ్రాముల డబ్బా రూ.40, టిన్ రూ.45, 200 గ్రాముల పంచామృతం డబ్బా రూ.20కి విక్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో సుమారు 20,000 డబ్బాలు విక్రయమవుతుండగా, విశేష పర్వదినాల్లో 1.50 లక్షల వరకు భక్తులు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, పంచామృతం నాణ్యత తెలుసుకోవాలని దేవస్థానం నిర్ణయించింది. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆమోదించిన ప్రైవేట్ ఫుడ్ అనాలసిస్ లేబొరేటరీకి పంచామృతం శాంపిల్స్ పంపించారు. వివిధ రోజుల్లో తయారుచేసిన పంచామృతాన్ని పరిశోధించగా, పంచామృతం నాణ్యమైనదని, 50 రోజుల వరకు పాడయ్యే అవకాశం లేదని ఫలితాల్లో వెల్లడైంది. దీంతో, భక్తులకు విక్రయించే అభిషేక పంచామృతం గడువు 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రకారం, గడువు తేదీ కొనుగోలు చేసిన రోజు నుంచి 30 రోజులు వినియోగించవచ్చు. ప్రస్తుతం పంచామృతం తయారీ తేదీ, గడువు తేదీ ముద్రించి విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ద్రావిడ రంగు పులుముకున్న మరో పార్టీ అవసరమా?

● టీవీకేపై తమిళిసై విమర్శ



కమలాలయంలో మీడియాతో మాట్లాడుతున్న తమిళిసై

ప్యారీస్, సెప్టెంబరు 17: డీఎంకే లాగే ద్రావిడ రంగు పులుముకున్న మరో పార్టీ రాష్ట్రానికి అవసరం లేదని విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగంను ఉద్దేశించి తెలంగాణా మాజీ గవర్నర్, బీజేపీ నేత డా.తమిళిసై సౌందర్‌రాజన్ వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ 74వ జన్మదిన వేడుకలను మంగళవారం టి.నగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమిళిసై మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమితో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం వంద రోజులుగా మంచి పాలన అందిస్తోందని, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఒక్కొక్క పార్టీ నిర్వాహకులు తలా 74 మందిని పార్టీలో సభ్యులుగా చేర్చాలని కోరారు. తూత్తుకుడి హార్బర్‌ను విదేశీ స్థాయికి పెంచిన ప్రధానికి ఆ నియోజకవర్గ ఎంపీ కనిమొళి కనీసం కృతజ్ఞతలు కూడా తెలియజేయలేదన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధ చట్టం అమలుచేయాలనే కోరికతో డీపీఐ నేత తిరుమావళవన్ మహానాడు నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం ఆహ్వానించదగ్గదని, అయితే ఆయన అధికారపార్టీ ఒత్తిడికి గురై ప్రస్తుతం ఆ మాటే ప్రస్తావించడం లేదన్నారు. ఇటీవల రాజకీయాల్లో ప్రవేశించిన నటుడు విజయ్ ద్రావిడ రంగు పులుముకొని డీఎంకే బాటలో పయనిస్తున్నారని, తమ మహానాడు జరుపుకొనేందుకు అడ్డంకులు చెబుతున్న పాలకులకు విజయ్ దాసోహమయ్యారని ఆమె ఎద్దేవా చేశారు.

అన్ని మతాలు సమానమేనన్న ఇంగితజ్ఞానం లేదు ...

అన్ని మతాలు సమానమేనన్న ఇంగితజ్ఞానం తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్‌కు లేదని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ మండిపడ్డారు. మంగళవారం ఉదయం తిరుచ్చి వెళ్లే ముందు కేంద్ర మంత్రి మురుగన్ మీడియాతో మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా విజయ్ కూడా శుభాకాంక్షలు తెలియజేస్తారని ఎదురుచూశామని, అయితే ఆయన ద్రావిడ సిద్ధాంతివాదిగా వ్యవహరిస్తున్నారన్నారు. సహజంగా రాజకీయాల్లో ఉన్న వారు కుల,మత, భాషా భేదాలు లేకుండా అందర్నీ సమానంగా చూడాలన్నారు.

హొగెనేకల్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో



హొగెనేకల్ జలపాతం వద్ద స్నానానికి వెళుతున్న పర్యాటకులు

● పర్యాటకుల స్నానానికి అనుమతి

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో హొగేకల్ జలపాతానికి వచ్చే నీటి పరిమాణం కూడా క్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో జలపాతం వద్ద స్నానాలు చేసేందుకు అధికారులు పర్యాటకులకు అనుమతించారు.మంగళవారం ఉదయం నుంచి జలపాతంలో ఇన్‌ఫ్లో తగ్గడం, మిలాద్ ఉన్ నబీ సెలవు కారణంగా ఆ ప్రాంతానికి తరలివచ్చిన పర్యాటకులను స్నానం చేయడానికి అనుమతించారు. ప్రస్తుతం ఆ జలపాతం చుట్టుపక్కలా చల్లటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకుల రాక కూడా అధికమైంది.

వెస్ట్‌మాంబళంలో 'హోలోవేర్' కేంద్రం

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ టెక్నాలజీ ల్యాండ్ స్కేప్‌లో పేరుగాంచిన 'హోలోవేర్ కంప్యూటర్స్' వెస్ట్ మాంబళంలో తన మొట్టమొదటి కస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు రాఘవేంద్ర గణేశ్ సోమవారం దీనిని ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..దేశమంతటా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్లను తెరవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. చెన్నైలో తమ మొదటి కేంద్రాన్ని ప్రారంభించడం ఒక మైలురాయిగా అభివర్ణించారు. తమ ఎ1 ల్యాప్‌టాప్ లాంచ్ కోసం ఇంటెల్‌తో భాగస్వామ్యం పెట్టుకున్నామని, ప్రపంచ వేదికపై కంప్యూటింగ్ భవిష్యత్తును పునర్నిర్వచించే విప్లవాత్మక ఉత్పత్తులను పరిచయం చేస్తున్నామని వివరించారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేంద్ర గణేశ్



మసాలా తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ భాస్కర పాండ్యన్

మహిళా సంఘాల ద్వారా మసాలా తయారీ

పెరంబూర్, సెప్టెంబరు 17: తిరువణ్ణామలై జిల్లాలో ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి అవసరమైన మసాలాను ప్యాకెట్ల రూపంలో కాకుండా, మహిళా స్వయం సహాయక బృందాలు స్వయంగా తయారుచేస్తున్నారు. ఈ పనులను జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అల్పాహార వంటలకు ప్యాకెట్లలో లభించే మసాలా పొడులు వినియోగించడం లేదన్నారు. జిల్లాలోని 18 తాలూకాల్లో తలా ఒక మహిళా స్వయం సహాయక బృందాలు మసాలా పొడులు తయారుచేస్తున్నాయని, వీటి ద్వారా ఈ బృందాలకు ఏడాది కి రూ.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ తెలిపారు.

దేశవ్యాప్తంగా మద్యనిషేధం అమలుచేస్తే రాష్ట్రం అడ్డుకోదుగా

● బీజేపీపై స్పీకర్ అప్పావు సెటైర్లు



పెరంబూర్, సెప్టెంబరు 17: ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా మద్యనిషేధం అమలు చేస్తే తమిళనాడు అందుకు అడ్డం కాదని స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. మద్యనిషేధం అనేది ఒక పార్టీ అజెండాగా ఉందని, దానిపై మహానాడు జరుపడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. తిరునల్వేలి జిల్లా రాధాపురంలో జాతీయ విపత్తుల బృందం మండల కార్యాలయాన్ని స్పీకర్ అప్పావు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ విలేఖరులతో మాట్లాడుతూ... దేశంలో సంభవించే విపత్తుల్లో నివారణ, రక్షణ చర్యలు చేపట్టేలా 2006లో జాతీయ విపత్తుల నిర్వహణ కమిషన్ ఏర్పాటైందని, తొలుత ఆరు రాష్ట్రాల్లో కేంద్రాలు కలిగిన ఈ కమిషన్‌కు ప్రస్తుతం 16 ప్రాంతాల్లో కేంద్రాలున్నాయన్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి ప్రాంతాల్లో జరిగే విపత్తుల్లో సహాయక చర్యల్లో ఈ బృందాలు పాల్గొంటాయన్నారు. రాష్ట్రంలో అరక్కోణంలో ఒకటి, కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో రెండో కేంద్రం ఉండగా, ప్రస్తుతం రాధాపురంలో మూడో కేంద్రం ప్రారంభమైందని తెలిపారు. ఈ కేంద్రలో 30 మందితో కూడిన బృందం విపత్తుల నివారణ చర్యల్లో పాల్గొంటుందన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు తిరునల్వేలి జిల్లా వల్లియూర్, రాధాపురం ప్రాంతాల్లో 5 ఎకరాలు ఎంపికచేస్తున్నట్టు స్పీకర్ తెలిపారు.



జ్యోతి వెలిగించి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరులో మలర్ ఆస్పత్రి ప్రారంభం

వేలూరు, సెప్టెంబరు 17: స్థానిక సత్తువాచేరిలో అధునాతన వసతులు, పరికరాలతో ఏర్పాటైన మలర్ ఆసుపత్రి మంగళవారం ప్రారంభించారు.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ పాల్గొని జ్యోతి వెలిగించి ఆస్పత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, లెక్చరర్ డా.శ్రీధర్, డా.కాంచనదేవి, వేలూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు అముద జ్ఞానశేఖరన్, కౌన్సిలర్లు చక్రవర్తి, గణేష్, బాబు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చెన్నైరైల్వే డివిజన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ'



మొక్క నాటుతున్న డీఆర్ఎం బి.విశ్వనాథ్ ఈర్య

ఐసిఎఫ్, సెప్టెంబరు 17: చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ (ఎస్‌హెచ్ఎస్)' క్యాంపైన్ 2024 మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో చెన్నై రైల్వే డివిజన్ మేనేజర్ బి.విశ్వనాథ్ ఈర్య పాల్గొని, ఎస్‌హెచ్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెంట్రల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అడిషినల్ డివిజనల్ మేనేజర్లు ప్రతాప్ సింగ్, అంకూర్ చౌహాన్, చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ.ఇలంపూర్ణన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు, స్కౌట్, గైడ్స్ విద్యార్థుల అవగాహన ర్యాలీని చెన్నై డివిజినల్ మేనేజర్ జెండా ఊపి ప్రారంభించడంతో పాటు, స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.